www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

గురువారం
12.11.2026

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై, కేంద్రంలోని బీజేపీ నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జరిగిన రైతు గర్జన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ రైతుల కష్టాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ లోపం, ఎన్నికల హామీల అమలుపై పాలకులను నిలదీశారు. రాష్ట్రంలో రైతు బంధు, రుణమాఫీ, యూరియా కొరత, సాగునీటి విడుదలలో జాప్యంతో రైతన్నలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్రంలోని బీజేపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన రెండు ఢిల్లీ పార్టీలకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని కేటీఆర్ ఈ వేదికగా పిలుపునిచ్చారు.

కలంజ్యోతి, నిర్మల్



వైఫు ఫంట కలుపు మొక్క కాంగ్రెస్

- ఢిల్లీ పార్టీలను ఢిల్లీకి తరిమి కొడదాం
- రైతు జీవితం కంటే రాజకీయాలే ప్రధానమా?
- రైతు ఇంట చావు డప్పు రాష్ట్రానికి అరిష్టం
- రైతు గర్జన సభలో కేటీఆర్

కలం జ్యోతి, నిర్మల్ (నవంబర్ 11) : దేశానికి అన్నం పెడుతున్న రైతన్నల పంట చేలల్లో కలుపు మొక్క కాంగ్రెస్, అందుకే దేశమంతటా ఆ పార్టీని ఛీకొడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ఎల్ నినో ప్రభావంతో దేశమంతటా కరవు తాండవిస్తుంటే బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణకు పంపేందుకు సర్వే బృందాలు కనిపించడం లేదని ఆయన ఆరోపించారు. ఈ రెండు ఢిల్లీ పార్టీలను ఢిల్లీ దాకా తరిమి కొట్టే సమయం

మిగతా 3లో..

తళ్లపల్లి సంజనకి సత్కారం




సమాజ సేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, వేలాది మంది మహిళలకు ఉపాధి శిక్షణతో అండగా నిలుస్తున్న తాళ్లపల్లి సంజన ప్రతిష్టాత్మక మాతృసవనం పురస్కారాన్ని అందుకున్నారు. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో జరుగుతున్న చిన్నజీయర్ స్వామి సప్తతి మహోత్సవాల్లో భాగంగా ఆయన చేతుల మీదుగా ఈ విశిష్ట సత్కారం జరిగింది. సమాజ హితం కోసం నిశ్శబ్దంగా కృషి చేస్తున్న మహిళామూర్తులకు దక్కిన ఈ అరుదైన గౌరవంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

కలంజ్యోతి, హైదరాబాద్

3 లో

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
గురువారం 12.11.2026
www.kalamjyothi.com



దేశ భవిష్యత్తు బీజేపీతోనే సాధ్యం

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 12) : నర్సంపేట నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ రోజురోజుకూ బలోపేతం అవుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీజేపీ విధానాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై విశ్వాసంతో ఆ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. నల్లబెల్లి బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ అధ్యక్షతన, ముచ్చింపుల గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మారం క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ముచ్చింపుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బత్తిని రవి, పులి చంద్రయ్య, పులి మహేష్, బీఆర్ఎస్ నాయకుడు బోనగాని కుమారస్వామి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బీజేపీయే బలమైన ప్రత్యామ్నాయం..

ఈ సందర్భంగా గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పనతో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు బీజేపీ సిద్ధాంతాలు, మోదీ నాయకత్వం పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో నర్సంపేట నియోజకవర్గంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి బీజేపీ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బత్తిని కుమారస్వామి గౌడ్, ముచ్చింపుల గ్రామ ప్రధాన కార్యదర్శి బత్తిని మల్లికార్జున్, యువమోర్చా మండల అధ్యక్షుడు తిమ్మాపురం శివ, పార్టీ నాయకులు కక్కెర్ల సమ్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



కలంజ్యోతి, హన్మూర (నవంబర్ 11) : మండల పరిధిలోని నాగారం గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక డిజిటల్ విద్యను అందించాలనే సదుద్దేశంతో నాగారం ఉపసర్పంచ్ మీసాల నర్సింలు ఉచితంగా టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ నర్సింలు మాట్లాడుతూ విద్యార్థులు నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నాణ్యమైన విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల సమగ్ర అభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల విద్యార్థుల కోసం టీవీని విరాళంగా అందించినందుకు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉపసర్పంచ్ నర్సింలకు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆరుతడి పంటల సాగే మేలు

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకోవాలి

కలంజ్యోతి, ఇల్లంతకుంట (నవంబర్ 12) : యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంపై పడే ఒడిదుడుకులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. మండలంలోని పొత్తూరు గ్రామ రైతు వేదికలో సర్పంచ్ పట్నం అశ్విని ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు ఇచ్చే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ విత్తనాలు, పంటల ఎంపికలో రైతాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

సేంద్రియ ఎరువులతోనే భూసార పరిరక్షణ..

మరోవైపు 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా రసాయన ఎరువుల మితిమీరిన వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని గణనీయంగా పెంచాలని అధికారులు దిశానిర్దేశం చేశారు. దీనివల్ల భూసారం, నేల సహజ స్వభావం దెబ్బతినకుండా కాపాడుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ (డీసీఓ), మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల రెవెన్యూ అధికారి సురేష్, ఎంపీఓ వజీర్ అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అఖిల్, విద్యుత్ శాఖ ఏఈ నగేష్, పశువైద్యాధికారి ఇందిర, ఏఈఓ రవళి, పంచాయతీ కార్యదర్శి పద్మ, ఉపసర్పంచులు రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఆస్తులపై ఏసీబీ నజర్

అర్ధరాత్రి వరకు సోదాలు



కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 11) : నిర్మల్ జిల్లా భైంసా మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ గా కొనసాగుతూ ఏసీబీ దాడుల్లో మంగళవారం పట్టుబడిన జాదవ్ సంతోష్ ఆస్తులపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. అర్ధరాత్రి వరకు నిర్మల్ దివ్యనగర్ లోని ఆయన నివాసంలో అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయన ఇటీవలే కొత్త ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. ఈ ఇంట్లో జరిపిన సోదాల్లో బంగారు నగలతో పాటు పాలు భూ కొనుగోళ్లకు సంబంధించిన పత్రాలను కూడా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. నిర్మల్, భైంసా పురపాలికల్లో డి ఈ ఈ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో భారీగా ఆస్తులు సమకూర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఎ ఈ గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన సంతోష్ అతి తక్కువ కాలంలో ఇన్ని ఆస్తులు ఎలా సంపాదించారన్న విషయంపై కూడా దర్యాప్తు సాగిస్తున్నారు. కాగా గతంలో సంతోష్ పై అవినీతి ఆరోపణలున్న నేపథ్యంలో ఈ సోదాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



భూగర్భజలాల పెంపునకు చర్యలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 12) : రానున్న రోజుల్లో భూగర్భ జలాలను పెంపొందించి, గ్రామంలో నీటి ఎద్దడిని నివారించడమే లక్ష్యంగా బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ విధానాన్ని ప్రారంభించినట్లు గ్రామ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు భూక్య మైబు సింగ్ రాథోడ్ తెలిపారు. చెన్నారావుపేట మండలం చెరువు కొమ్ము తండాలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటిని వృథాగా వెళ్లనివ్వకుండా ప్రత్యేక ఫిల్టర్ విధానం ద్వారా శుద్ధి చేసి బోరుబావుల్లోకి మళ్లించడం వల్ల భూగర్భ జలమట్టాలు పెరిగేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి కొరతను ఎదుర్కోకుండా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొర్ర మోహన్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

కలంజ్యోతి, నిర్మల్ : స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను కలాం గుణం సంస్థ ఆధ్వర్యంలో నిర్మల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశ అభ్యున్నతి కోసం సాంకేతిక విద్యాభివృద్ధి లౌకికవాద పెంపునకు చేసిన కృషిని కొనియాడారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా, ఉన్నత సాంకేతిక వైజ్ఞానిక విద్యకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ రూపొందించిన ప్రణాళికలు ఇప్పటికీ ఆచరణలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న, సొసైటీ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కె రాం కిషన్ రెడ్డి, యువ నాయకుడు నల్ల వినయ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అయ్యన్న గారి రాజేందర్, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ కొట్టే శేఖర్, టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొన్నారు.


కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

గురువారం 12.11.2026

www.kalamjyothi.com



రైతు ఇంట కలుపు మొక్క కాంగ్రెస్

▸▸ మొదటిపేజీ తరువాయి



ఆసన్నమైందని ఆయన అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం లో బుధవారం జరిగిన రైతు గర్జన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ సమక్షంలో వరంగల్ లో ప్రకటించిన రైతు డిక్లరేషన్ హామీలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో రైతు సంక్షేమం కోసం చేపట్టిన రైతు బంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతు బీమా, యూరియా కొరత తీర్చడం, 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా పూర్తిగా అటకెక్కాయని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతు ఇంట్లో చావు డప్పు మొగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం క్యూలో స్పృహ తప్పి పడిపోయే పరిస్థితి, రుణ మాఫీకోసం బ్యాంకుల్లో పురుగుల మందు తాగి చనిపోవటం సర్వ సాధారణం అయిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి పథకం 90 శాతం పూర్తయినా దాన్ని ఉపయోగంలోనికి తేలేని దౌర్భాగ్యస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రస్తుతం ఏర్పడిన కరవు పాలకుల వికృత వ్యవహారాలకు నిదర్శనమని, ఎల్నీనో కరువు కాదని ఆయన విమర్శించారు. ఒకపక్క పొరుగు రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు కుప్పం దాకా నీటిని తీసుకెళ్తుంటే రేవంత్ రెడ్డికి ఉన్న ప్రాజెక్టులను నిర్వహించడం చేతకావడం లేదన్నారు. ప్రస్తుతం "ఆంధ్రకు నీళ్లు తెలంగాణకు ఎక్కిళ్ళు" అన్న చందంగా పరిస్థితి మారిందన్నారు. నిర్మల్ జిల్లాలో పలు ప్రాజెక్టులు ఉన్న రైతన్నలకు సరిపడా సాగునీరు అందడం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.73 వేల కోట్లు 11 విడతలుగా రైతులకు రైతుబంధు కింద అందజేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో బి ఆర్ ఎస్ గెలిచాక ఎగ్గొట్టిన రైతుబంధు తో పాటు యాసంగి పంటలకు కూడా రైతుబంధు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురు చూస్తున్న పెండింగ్ డి ఏ లు, పిఆర్సి తమ ప్రభుత్వం రాగానే పూర్తిస్థాయిలో ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.

రేవంత్ కొమ్ము కాస్తున్న బిజేపీ..

రాష్ట్ర అసెంబ్లీలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న బిజెపి లెజిస్లేచర్ పార్టీ నేత మహేశ్వర్ రెడ్డి, తదితర ఎమ్మెల్యేలు రేవంత్ కొమ్ము కాస్తున్నారని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు నిర్మల్ లో జరిగిన రైతు గర్జనలో ఆయన మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షం గా ఉన్న తమ నేతలపై దౌర్జన్యం చేసి, మహిళా శాసన సభ్యులపై చేయి చేసుకున్నా కూడా కనీస స్పందన లేదన్నారు. రేవంత్ కొమ్ము కాస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. జిల్లాలో బీజేపీ ఎంపీ, ఎంఎల్ఏ లు ఉన్నా కనీసం రైల్వే లైన్ కూడా వేయించలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు.

ఆసక్తికరంగా సాగిన రైతు గర్జన..

నిర్మల్ లో జరిగిన రైతు గర్జన సభలో కేటీఆర్ మాట్లాడుతున్న సందర్భంలో స్టేజి ముందున్న యువకులు మాట్లాడుతుంటే కేటీఆర్ వారిని ఉద్దేశించి మాట్లాడారు. కొద్దిమంది అందరిని డిస్టర్బ్ చేయవద్దని సభను సక్రమంగా కొనసాగించాలని కోరారు. కాగా రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న క్రమంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల వీడియోలు స్టేజ్ పై ఉన్న స్క్రీన్ లో ప్రదర్శిస్తూ ప్రసంగించడం ఆకట్టుకుంది. అలాగే నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఇచ్చిన హామీలను కూడా ప్రస్తావిస్తూ స్క్రీన్ పై ప్రదర్శించడం కొసమెరుపు. ఇదిలా ఉంటే నీటి వనరుల విషయంలో పొరపాటున రేవంత్ రెడ్డి అనే బదులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పేరును ప్రస్తావించి ఆ తర్వాత సవరించుకున్నారు.

ధన్యభూమి నిర్మల్..

నిర్మల్ ధన్య భూమి అని కేటీఆర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు 1996లో నిర్మల్ ఉప ఎన్నిక సందర్భంగా ఇన్చార్జిగా వ్యవహరించిన కేసిఆర్ ఎస్సారెస్పీని సందర్శించి నిర్వహణలోపాలపై ఆవేదన చెందారన్నారు. పరిస్థితులు అనుకూలించి ప్రభుత్వ పగ్గాలు చేపడితే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తానని ఆ రోజే ప్రకటించారని అందులోంచి పార్టీ ఆవిర్భావ ఆలోచన పుట్టిందని ఆయన ప్రజల హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జోగు రామన్న, ప్రశాంత్ రెడ్డి, నిర్మల్ నియోజకవర్గం ఇన్చార్జ్ రామకిషన్ రెడ్డి, జాన్సన్ నాయక్, అనిల్ జాదవ్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, దివాకర్ రావు, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, జీవన్ రెడ్డి, గంప గోవర్ధన్, బాజిరెడ్డి గోవర్ధన్, హనుమంత్ షిండే, రమాదేవి, ఎన్ వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



- స్ఫూర్తిదాయక నాయకత్వానికి దక్కిన విశిష్ట గౌరవం
- అలివేలు మంగమ్మ పేరిట అవార్డుల ప్రదానం
- మహిళామూర్తుల సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకం
- శ్రీరామనగరంలో ఘనంగా సప్తతి ఉత్సవాలు



తళ్లపల్లి సంజనకి సత్కారం

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 11) : సమాజ సేవారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న తాళ్లపల్లి సంజన.. చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక మాతృసవనం పురస్కారాన్ని అందుకున్నారు. ముచ్చింతల్ సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో కొనసాగుతున్న యతీంద్ర సప్తతి తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా ఈ సత్కార కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిశ్శబ్దంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్న నారీమణుల కృషిని వేదికపై కొనియాడారు.

ఘనంగా సప్తతి ఉత్సవాలు..

చిన్నజీయర్ స్వామి 70వ పుట్టినరోజు సందర్భంగా శ్రీరామనగరంలో నవంబర్ 8 నుంచి 12వ తేదీ వరకు సప్తతి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న సైనికులు, శాస్త్రవేత్తలతో పాటు వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులను ఈ వేదికపై సత్కరిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సమాజ శ్రేయస్సుకు దోహదపడే వినూత్న సదస్సులు, సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

అలివేలు మంగమ్మ పేరిట అవార్డు..

స్వామివారి మాతృమూర్తి కీర్తిశేషులు అలివేలు మంగమ్మ జ్ఞాపకార్థం సమాజసేవానిరతులైన 70 మంది విశిష్ట మహిళలకు మాతృసవనం పురస్కారాలను అందజేశారు. మట్టిలో మాణిక్యాల్లా ఉంటూ సమాజానికి దారిచూపుతున్న స్త్రీమూర్తులకు కృతజ్ఞతగా ఈ పురస్కారాలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలు సమాజ నిర్మాణంలో పోషిస్తున్న పాత్రను గుర్తించి గౌరవించడం అందరికీ ఆదర్శనీయమని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

స్ఫూర్తిదాయక నాయకత్వానికి దక్కిన విశిష్ట గౌరవం..

తాళ్లపల్లి సంజన శ్రీ నేచురల్ హనీ ఫామ్స్ నుంచి మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తూ.. ఆర్థికంగా బలపడేందుకే కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు 8 వేల మందికి పైగా శిక్షణ తీసుకున్నారు. కాగా, సమాజానికి అందించిన నిస్వార్థ సేవలు, మానవీయ నాయకత్వ పటిమను ప్రశంసిస్తూ ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు. చిన్నజీయర్ స్వామి స్వయంగా మంగళాశాసనపూర్వకంగా అందించిన ఈ సత్కారంపై పలువురు ప్రముఖులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. సమాజ హితమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మహిళామూర్తులకు ఈ గుర్తింపు మరింత ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

నా బాధ్యతను మరింత పెంచింది...

చినజీయర్ స్వామి దివ్య ఆశీస్సులతో మాతృసవనం పురస్కారం అందుకోవడం తన పూర్వజన్మ సుకృతమని తాళ్లపల్లి సంజన హర్షం వ్యక్తం చేశారు. ఈ విశిష్ట పురస్కారం సమాజం పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని, తన సేవా ప్రయాణంలో తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఆమె పేర్కొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
గురువారం 12.11.2026
www.kalamjyothi.com



కార్మికుల సంక్షేమానికే ప్రాధాన్యత

- పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ
- ప్రజారోగ్యం కోసం కార్మికుల సేవలు వెలకట్టలేనివి
- కార్మికుల రక్షణ పరికరాల కల్పనకు కట్టుబడి ఉన్నాం
- మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 12) : పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అండగా నిలుస్తూ మున్సిపల్ పాలకవర్గం దుస్తులు, చెప్పులు, ఇతర నిత్యావసర రక్షణ సామగ్రిని అందజేసింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ కార్మికులకు ఈ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని స్పష్టం చేశారు. ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచే విధులకు హాజరవుతూ ఎండ, వాన, చలిని సైతం లెక్కచేయకుండా వీధులు, రోడ్లు, డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు పాటుపడుతున్న వారి సేవలను ప్రత్యేకంగా కొనియాడారు.

కార్మికుల రక్షణ పరికరాల కల్పనకు కట్టుబడి ఉన్నాం..


కార్మికులు తమ సొంత ఆరోగ్యాన్ని కూడా కాపాడుకుంటూ విధులు నిర్వహించాలని, వారికి అవసరమైన అన్ని రకాల రక్షణ పరికరాలు, మౌలిక సౌకర్యాలు సమకూర్చేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం తగిన చర్యలు తీసుకుంటుందని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం, గౌరవం, రక్షణకు పూర్తి ప్రాధాన్యత ఇస్తూ సమాజంలో వారి విశేష సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, కమిషనర్ కంచర్ల నరేశ్ రెడ్డి, కౌన్సిలర్లు కాంపెల్లి వీణ విజయేందర్ రెడ్డి, ముత్తినేని వెంకన్న, బీరం భరత్ రెడ్డి, మాదాసి రవి, పున్నం నరసింహారెడ్డి, ఏపూరి శ్రీనివాస్ రెడ్డి, శ్రీరామోజ్ రోజా రాణి, వేల్పుల శ్రీలత, హన్మకొండ శ్రీధర్, దొంగల రజిత, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కందిక స్వామి, మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వధూవరులకు ఎమ్మెల్యేల ఆశీర్వాదం

ఘనంగా మాజీ ఎంపీపీ కుమారుడి వివాహం

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 11) : చెన్నారావుపేట మండలం సూర్యాపేట తండాకు చెందిన మాజీ ఎంపీపీ దారావత్ అమ్మి-రఘు దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై నూతన వధూవరులు రాజ్‌కుమార్, శ్రీ చామంతిలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దన రమేష్, సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ దార రంజిత్, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, మంద శ్రవణ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు


- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతి
- పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధికి నిధులివ్వాలి
- కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం అవసరం
- బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 12) : నర్సంపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులు మంజూరు చేయించాలని కోరుతూ బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల ఆధునీకరణ, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ సీఎస్ఆర్ నిధులు కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం..

నర్సంపేట ప్రాంత సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రముఖ కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం కూడా ఎంతగానో అవసరమని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి వివరించారు. స్థానిక ప్రజల అత్యవసర సమస్యలను గుర్తించి నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యేలా చూడాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సంపేట అభివృద్ధే తమ ప్రథమ లక్ష్యమని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు సమకూర్చి అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.





ఆది శ్రీనివాస్‌కు గాయం

కాలికి ఫ్లెక్సీ బాండ్ అంటుకోవడంతో ఆసుపత్రికి తరలింపు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 12) : ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాలికి గాయమైంది. కథలాపూర్ మండలం ఇప్పపల్లి వద్ద ఓ కార్యక్రమానికి హాజరైన క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీకి ఉపయోగించే ఫ్లెక్సీ బాండ్ ఆయన కాలికి ప్రమాదవశాత్తు అంటుకుంది. దీంతో కాలికి తీవ్ర నొప్పి కలగడంతో వెంటనే ఆయనను వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో కాలికి అంటుకున్న ఫ్లెక్సీ బాండ్‌ను తొలగించి అవసరమైన చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను పరామర్శించేందుకు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకుంటున్నారు.


కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

గురువారం 12.11.2026


www.kalamjyothi.com



చేయూత పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

- అర్హులందరికీ మంజూరు పత్రాలు అందించాలి
- వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష
- అర్హులందరికీ మంజూరు పత్రాలు అందించాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 12) : చేయూత సామాజిక భద్రత కింద జిల్లాలో కొత్తగా అర్హత సాధించిన లబ్ధిదారులకు పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చేయూత పెన్షన్లకు సంబంధించి సమీక్షిత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అడిటోరియంలో మంగళవారం డీఆర్డీఓ, చేనేత జౌళి శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

అధికారుల పర్యవేక్షణలో అర్హుల ఎంపిక..

సమీక్షలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు (తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా), గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. అర్హులైన వారిని పారదర్శకంగా ఎంపిక చేసేందుకు మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారుల ఆధ్వర్యంలో సమగ్ర విచారణ పూర్తి చేయించామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసేందుకు తగిన కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.

రైతులకు రక్షణ కల్పించాలి

- రైతుల వద్ద సంతకాలు సేకరణ దేనికి?
- నిబంధనలపై సమగ్ర విచారణ జరపాలి
- డేటా భద్రతకు ముప్పు పొంచివుంది
- సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అనుమానాస్పద పత్రాలపై సంతకాలు చేయొద్దు
- పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్


తొగరు చెన్నారెడ్డి



కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 11) : ప్రైవేట్ సంస్థలు చేస్తున్న మోసపూరిత వ్యవహారాలపై విచారణ జరిపి అన్నదాతలను ఆదుకోవాలని పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో వ్యవసాయ అధికారికి అధికారికంగా వినతిపత్రం అందజేశారు. పల్లెల్లో అమాయక రైతులను మభ్యపెడుతూ సాగుతున్న అగ్రిమెంట్ల దందాపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. కాగా, పర్యావరణ పరిరక్షణ, వరి సాగులో నీటి పొదుపు పద్ధతులు, కార్బన్ క్రెడిట్ ప్రాజెక్టుల పేరుతో ప్రైవేట్ ఏజెన్సీల ప్రతినిధులు గ్రామాల్లోకి చొరబడుతున్నారు. మిట్టి ల్యాబ్స్, త్రయి కన్జర్వ్ సర్వీసెస్ వంటి కంపెనీలు రైతు ఒప్పంద పత్రాల పేరిట సాగుదారుల వద్దకు నేరుగా వస్తున్నాయి. సాంకేతిక పదజాలంతో అమాయక రైతులను అయోమయానికి గురిచేస్తూ, వారి చేత ఒప్పంద పత్రాలపై సంతకాలు, బొటనవేలి ముద్రలు సేకరిస్తున్నారు. ఈ తతంగం వెనుక రైతుల హక్కులను హరించే పెద్ద కుట్ర దాగివుందని మండిపడ్డారు.

సమగ్ర విచారణ జరపాలి..

ఈ సంస్థలు రైతులతో చేసుకుంటున్న అగ్రిమెంట్లలోని నిబంధనలను పరిశీలిస్తే రైతులకు తీవ్ర నష్టం కలిగించే అనేక అనుమానాస్పద అంశాలు కనిపిస్తున్నాయి. ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల రైతుకు ప్రత్యక్షంగా దక్కే నగదు ప్రయోజనం గానీ, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలపై గానీ ఎలాంటి స్పష్టమైన హామీ లేదు. మండలంలో యథేచ్ఛగా తిరుగుతున్న ఈ సంస్థలకు అసలు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిజాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు.



రైతుల డేటా భద్రతకు ముప్పు..

రైతుల భూమి పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలు, ఆధార్ సమాచారం, ఫోటోలు, డిజిటల్ డేటాను సేకరిస్తున్న సదరు సంస్థలు, ఆ డేటాపై పూర్తి హక్కులను మూడో వ్యక్తికి బదిలీ చేసుకునేలా ఒప్పంద పత్రాల్లో క్లాజులు చేర్చాయి. ఇది భవిష్యత్తులో రైతుల భూమి యాజమాన్య హక్కులకు, వారి డిజిటల్ భద్రతకు పెను ప్రమాదంగా మారే అవకాశముంది. కార్బన్ క్రెడిట్లు, అంతర్జాతీయ మార్కెట్లపై అవగాహన లేని నిరక్షరాస్యులైన రైతులను ముందుపెట్టి, కంపెనీలు లాభాలు గడిస్తూ అన్నదాతలను న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేట్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి..

అనుమానాస్పద పత్రాలతో రైతులను మోసగిస్తున్న ఇలాంటి ప్రైవేట్ ఏజెన్సీలు, దళారులపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో రైతులను అప్రమత్తం చేసేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి ఊరిలో పర్యటించాలి. ఏఈవోలు గ్రామాల్లో దండోరా వేయించి, ఇలాంటి ప్రైవేట్ దరఖాస్తులపై సంతకాలు పెట్టవద్దని హెచ్చరికలు జారీ చేయాలి. ఇప్పటికే మోసపోయి సంతకాలు పెట్టిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి చట్టపరమైన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇకపై ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట

- చెరువుల ఆక్రమణలతోనే కాలనీలు జలమయమవుతున్నాయి
- మూసీ పునరుజ్జీవనం ఆగదు, బాధితులకు అండగా ఉంటాం
- తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన సీఎం



కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 12) : నగరంలో ఆధునీకరించిన తమ్మిడికుంట చెరువును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్నటి వరకు అందరూ శిల్పారామం గురించే మాట్లాడుకున్నారని, కానీ ఇవాళ్టి నుంచి తమ్మిడికుంట గురించే మాట్లాడుకుంటారని పేర్కొన్నారు. ఇకపై ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు, వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట అంటారని వ్యాఖ్యానించారు. కొంతమందికి తాత్కాలికంగా నష్టం జరిగినా, రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతోనే తమ్మిడికుంటను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని స్పష్టం చేశారు. ఒకప్పుడు ఆక్రమణలకు గురై కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును, ఇప్పుడు 30 ఎకరాల విస్తీర్ణానికి పెంచినట్లు వివరించారు. చెరువు విస్తరణ కోసం నటుడు నాగార్జున 2 ఎకరాల స్థలాన్ని అందించారు.

చెరువుల ఆక్రమణలతోనే కాలనీలు జలమయమవుతున్నాయి..

హైదరాబాద్ నగరం అంటేనే రాక్స్ అండ్ లేక్స్ సిటీ అని సీఎం గుర్తుచేశారు. గతంలో నగరంలో 1372 చెరువులు ఉండేవని, కానీ వివిధ కారణాలు, ఆక్రమణల వల్ల దాదాపు 50 శాతం చెరువులు కనుమరుగైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులను కబ్జా చేయడం వల్లే కొద్దిపాటి వర్షం పడినా రోడ్లపైకి నీళ్లు రావడం, కాలనీలు చెరువులను తలపించడం జరుగుతోందని, ఈ దుస్థితిపై సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. వందేళ్ల క్రితమే మూసీ వరదల నుంచి నగరాన్ని రక్షించడానికి నిజాం పాలకులు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించారని, ముచుకుందా నది.. మూసా, ఈసా సంగమంతో మూసీగా రూపాంతరం చెంది నదీ నాగరికతకు కేంద్రంగా మారిందని గుర్తుచేశారు.


మూసీ పునరుజ్జీవనం ఆగదు, బాధితులకు అండగా ఉంటాం..

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మూసీ తీవ్రంగా కలుషితమైందని, ఆ విషపు నీటి ప్రభావంతో నల్లగొండ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా తీవ్ర అనారోగ్యాలతో శిక్ష అనుభవిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మూసీకి కావాల్సింది కేవలం బాహ్య సుందరీకరణ కాదని, దానికి పూర్తిస్థాయి పునరుజ్జీవం కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఏ ఒక్కరికీ అన్యాయం లేదా నష్టం జరగకుండా ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుంటుందని, త్వరలోనే మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడాలని, నగరాభివృద్ధి కోసం అన్ని పక్షాలూ రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. నగరంలోని చెరువులను కాపాడుకుంటూనే వాటి చుట్టూ లేక్ ఎకానమీని ప్రోత్సహిస్తామని, తమ్మిడికుంట ప్రాంగణంలో ప్రజలకు పూర్తి భద్రత ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే చెరువు ఆవరణలో ఒక జమ్మి చెట్టును నాటాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచిస్తూ, తద్వారా దసరా వంటి సంప్రదాయ వేడుకలకు చెరువులు కేంద్ర బిందువులుగా మారి మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

మెగాస్టార్ ఉదారత నన్ను కట్టిపడేసింది

సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న నటి నివేదా పేతురాజ్ మెగాస్టార్ చిరంజీవిపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రస్తుతం చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న కాకా సినిమాలో నివేదా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన సినీ ప్రస్థానం పదేళ్లు పూర్తయిందని సెట్‌లో సాధారణంగా చెప్పానని, ఆ మాట విన్న చిరంజీవి స్వయంగా ఆ వేడుకకు అన్ని ఏర్పాట్లు చేయించి తనను ఆశ్చర్యపరిచారని ఆనందంగా వివరించారు. అంత పెద్ద లెజెండ్రీ హీరో తనకోసం అంతగా ఆప్యాయత చూపడం నిజంగా గొప్ప విషయమని, అప్పుడే ఆయన ఉదారత ఏమిటో తనకు అర్థమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత కష్టపడి పనిచేసేందుకు చిరంజీవే తనకు అసలైన స్ఫూర్తి అని నివేదా చెప్పుకొచ్చారు.





Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.